క్లుప్తంగా

రక్తదానంతో ప్రాణాలు కాపాడవచ్చు..

● ఎపిటోరియా ఫార్మా హెచ్ఆర్ హెడ్ కమలాకర్ రెడ్డి


రక్తదానం చేస్తున్న పరిశ్రమ ఉద్యోగులు

పూసపాటిరేగ: రక్తదానంతో ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడవచ్చని ఎపిటోరియా ఫార్మా హెచ్ఆర్ హెడ్ కె. కమలాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎపిటోరియా ఫార్మా పరిశ్రమలో అరబిందో ఫౌండేషన్ సేవా కార్యక్రమంలో భాగంగా ర్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రక్త నిల్వలు పెంచడానికి ఇటువంటి శిబిరాలు ఉపయోగపడతాయని చెప్పారు. కార్యక్రమంలో ఎపిటోరియా ఫార్మా ప్రతినిధి పి.నారాయణరావు, మెడికల్ ఆఫీసర్ బురహాన్ సయ్యద్, వైద్యులు సోమశేఖర్, త్రిశాంక్ , లైజన్ అధికారి రాము పాల్గొన్నారు.

వైభవంగా హనుమత్ వ్రతం


ఆంజనేయస్వామి సన్నిధిలో పూజలు జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో ద్వాదశ శ్రీ హనుమత్ వ్రతాన్ని అర్చకులు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన తర్వాత ఆంజనేయస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపించారు. పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల ఫల రసాలతో స్వామికి అభిషేకాలు జరిపించి.. తమలపాకులు, సింధూరంతో అర్చనలు నిర్వహించారు. అనంతరం హనుమాన్ చాలీసాను చది వి వినిపించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన ఈఓ వై. శ్రీనివాసరావు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వికసిత్ భారత్ దిశగా విద్యాభ్యాసం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆచార్య అజిత్‌కుమార్

డెంకాడ: వికసిత్ భారత్ దిశగా విద్యార్థులు విద్యాభ్యాసం సాగించాలని ఢిల్లీకి చెందిన ఇండియా ఆన్ మూవ్ ఎన్‌జీఓ సంస్థ ఫౌండర్ చైర్మన్ అజిత్‌కుమార్ అన్నారు. మండలంలోని లెండి ఇంజినీరింగ్ కళాశాలలో వికసిత్ భారత్ – 2047 అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విద్యార్థులు విద్యను పూర్తి చేసుకున్న తర్వాత జాతి నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కోస్టల్ కారిడార్ అభివృద్ధి, స్పీడ్ రైల్వే, ఎక్స్‌ప్రెస్ హైవే వంటి నిర్మాణాలపై వివరించారు. విద్యార్థులు వినూత్న ఆలోచనలతో తమలోని ప్రతిభకు పదుపెట్టాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ పి.మధుసూదనరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ తమ్మినేని హరిబాబు, సైన్సెస్, హ్యూమానిటీస్ విభాగాధిపతి పి.దుర్గాశైలజ, ఎన్ఎస్ఎస్ పీఓ రవితేజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'స్వేదం'తో భూ సమస్యల పరిష్కారం

● డీఆర్ఓ ఎస్.శ్రీనివాసమూర్తి


మాట్లాడుతున్న డీఆర్ఓ శ్రీనివాసమూర్తి

విజయనగరం అర్బన్: భూ సమస్యల పరిష్కారానికి 'స్వేదం' ఎంతగాన ఉపయోగపడుతుందని డీఆర్ఓ ఎస్.శ్రీనివాసమూర్తి అన్నారు. పట్టణంలోని జియర్ కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటైన స్వేదం భూ సమస్యల పరిష్కార కేంద్రం, ధ్రువ పరిశోధన కేంద్రాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ధ్రువ పరిశోధన కేంద్రం అందించే సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ధ్రువ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ ఎం.గణపతిరావు మాట్లాడుతూ.. ప్రజల సమస్యలకు పరిష్కార మార్గాలు, సరైన సలహాలను అందించడం లక్ష్యంగా స్వేదం భూ సమస్యల పరిష్కార సలహా కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. అలాగే భూ సమస్యల పరిష్కారం కోసం మెరుగైన వేదికలు, సరికొత్త స్టార్టప్‌లు ఏర్పాటు చేయడం కోసం ధ్రువ పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కేఆర్‌డీ ప్రసాద్, కృష్ణంరాజు, చెరుకూరి కన్‌స్ట్రక్షన్ అధినేత చెరుకూరి శ్రీధర్, రెవెన్యూ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.రామారావు, సెక్రటరీ వెంకటేశ్వర్లు సీహెచ్ రమణమూర్తి, కోరాడ సత్యం, కోరాడ రామకృష్ణ, గరుడ అప్పలనాయుడు, సీహెచ్ కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

● సమయపాలన పాటించని వైద్యులు
● మధ్యాహ్నం 12 గంటలకే ఓపీ నుంచి జంప్
● సర్వజన ఆస్పత్రి న్యూరోసర్జరీ వైద్యుల నిర్వాకం
● అవస్థలు పడుతున్న రోగులు

ఇలా వచ్చి.. అలా వెళ్లి..


సర్వజన ఆస్పత్రిలో మధ్యాహ్నం 12 గంటకు వైద్యులు లేకపోవడంతో ఖాళీగా ఉన్న న్యూరోసర్జరీ వైద్యుల కుర్చీలు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో వైద్యులు సమయపాలన పాటించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. విధులకు డుమ్మా కొడుతూ మధ్యలోనే వెళ్లిపోతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి న్యూరోసర్జరీ విభాగం వైద్యులు మధ్యాహ్న 12 గంటలకే బయటకు వెళ్లిపోతున్నట్లు పలువురు చెబుతున్నారు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు ఇక్కట్లు తప్పడం లేదు. న్యూరో సర్జరీ ఓపీ సేవలు వారంలో మూడు రోజులు మాత్రమే అందిస్తారు. ఆ మూడు రోజులు కూడా పూర్తి స్థాయిలో సేవలు అందించడం లేదనే గుసగుసలు వినిపిస్తున్నాయి. న్యూరో సంబంధిత సమస్యలతో చాలా మంది దూర ప్రాంతాల నుంచి ఆస్పత్రికి వస్తుంటారు. ఓపీ తీసుకుని డాక్టర్ రూమ్ వద్దకు వచ్చేసరికే మధ్యాహ్నం పదకొండు, పన్నెండు గంటలవుతుంది. ఈలోగా వైద్యులు వెళ్లిపోవడంతో రోగులు ఉసూరోమంటూ వెనుదిరుగుతున్నారు. వాస్తవానికి ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు.. మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు వైద్యులు ఓపీ విభాగంలో సేవలందించాలి. అయితే వైద్యులు 12 గంటలకే వెళ్లిపోతున్నారు. పదే పదే ఈ విధంగా జరుగుతున్నప్పటికీ ఆస్పత్రి అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

విచారణ చేపడతాం..

ఓపీ విభాగాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు.. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 వరకు అందుబాటులో ఉండాలి. మధ్యలో వెళిపోతే చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

డాక్టర్ సంబంగి అప్పలనాయుడు, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

పారదర్శకంగా సాగునీటి సంఘాల ఎన్నిక


మాట్లాడుతున్న తహసీల్దార్ తాడ్డి గోవింద

పూసపాటిరేగ: సాగునీటి సంఘాల ఎన్నిక పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్ తాడ్డి గోవింద అధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సాగునీటి సంఘాల ఎన్నికలపై అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సాగునీటి సంఘాల ఎన్నికలలో పాల్గొనే ఓటర్లు ఉదయం 9 గంటల్లోపు పోలింగ్ బూత్‌కు చేరుకోవాలన్నారు. ఆధార్‌కార్డు, వన్‌బీ జిరాక్స్‌లను తీసుకురావాలని సూచించారు. పూసపాటిరేగ పరిధిలో అల్లాడపాలెం పాలవలస చానల్, పూసపాటిరేగ పెదచెరువు, రెల్లివలస కుమిలి చానెల్, కనిమెల్ల తిరుమల గెడ్డ చానల్, కందివలస ఊర చెరువు , కొవ్వాడ పెదచెరువు, వెంపడాం పెదచెరువు, వెల్దూరు అయ్యప్ప కోనేరుల సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం. రాధిక, డిప్యూటీ తహసీల్దార్ రమేష్, ఇరిగేషన్ ఏఈ రమేష్‌చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సహకరించాలి..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సభ్యులు సహకరించాలని ఎన్నికల అధికారి, డిప్యూటీ తహసీల్దార్ వీవీఆర్ జగన్నాథరావు కోరారు. మండలంలోని కొత్తపేట ప్రాథమిక పాఠశాలలో ఓటర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో మొత్తం 14 సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికలు జరగనున్నాయన్నారు. ఉదయం 8 గంటలకే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం సురేష్, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సమష్టికృషితోనే సుస్థిర అభివృద్ధి

● ఎంపీడీఓ రామకృష్ణరాజు


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

నెల్లిమర్ల: అధికారులు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషితోనే గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి సాధ్యపడుతుందని ఎంపీడీఓ రామకృష్ణరాజు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు, మండలస్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం రెండో రోజు శుక్రవారం కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా చూడాలని సూచించారు. ఆరోగ్యవంతమైన ఆహారపు అలవాట్లు ఉండాలన్నారు. ధూమపానం, మద్యపానం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా గ్రామాలను తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఈపు విజయ్‌కుమార్ విద్యాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో అభివృద్ధికి కృషి చేస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ శంకర్ జగన్నాథం, ఏఓ సుదర్శనం, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లపై రాజకీయ కక్షలు తగవు


తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న వలంటీర్లు

విజయనగరం ఫూల్‌బాగ్: ప్రభుత్వం అందించిన పథకాలను ప్రజలకు చేరవేయడంలో పారదర్శకంగా సేవలందించిన వలంటీర్లపై రాజకీయ కక్షలు తగవని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ అన్నారు. ఏపీ గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ కె. స్వర్ణకుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బుగత అశోక్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రెండు లక్షల అరవై వేల మంది వలంటీర్లకు అన్యాయం చేసిందన్నారు. ఎన్నికలకు ముందు వలంటీర్లందరికీ న్యాయం చేస్తామని, నెలకు రూ. పది వేలు ఇస్తామని చెప్పిన నాయకులు ఇప్పుడు ముఖం చాటేయడం అన్యాయమని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వలంటీర్లకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో విజయనగరం పట్టణానికి చెందిన వలంటీర్లు పాల్గొన్నారు.

సత్య కళాశాల విద్యార్థులకు కరాటే చాంపియన్‌షిప్


విజేతలతో కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కెన్యూరియు సంస్థ ఇటీవల విశాఖలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో విజయనగరం పట్టణానికి చెందిన సత్య కళాశాల కరాటే విద్యార్థులు చాంపియన్‌షిప్ సాధించారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీసాయిదేవమణి శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ విభాగాలలో ప్రతిభ చూపిన పి.హేమంత్ (రెండు బంగారు పతకాలు), ఎంహర్షవర్ధన్ (ఒక బంగారు, ఒక రజత పతకం), పి.హర్షవర్ధన్ (ఒక రజత, ఒక కాంస్య పతకం), కె.శివగణేష్ (ఒక బంగారు, ఒక రజత), బి.షణ్ముఖ శ్రీకర్ (ఒక రజత, ఒక కాంస్య పతకం), బి.శివ శ్రీహర్ష (ఒక బంగారు, ఒక కాంస్య పతకం), బి.రేశ్వంత్ (ఒక కాంస్య), ఎల్.జశ్వంత్ (రెండు కాంస్య), కె.మోహన్ చంద్ర (రజత పతకం), ఎం.సాత్విక్ (రజత), ఆర్.గణేష్ (కాంస్య), వి.చేతన్ ఆనంద్ సుహాస్ (కాంస్య), బి.భార్గవ్ కాంస్య పతకం సాధించి చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారని తెలిపారు. విజేతలను కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపాల్ దేవమణి, పీడీలు అభినందించారు.

మెస్సియా మార్చ్‌కు ఏర్పాట్లు పూర్తి


మాట్లాడుతున్న సిమ్స్ బాప్టిస్ట్ చర్చి కార్యదర్శి, సంఘమిత్ర ఆర్ఎస్.జాన్

విజయనగరం టౌన్: సర్వమానవాళి అభ్యున్నతికి పాటుపడిన ఏసుక్రీస్తు జన్మించిన డిసెంబర్ నెలలో ప్రతి ఏటా క్రమం తప్పకుండా మెస్సియా మార్చ్‌ను ఘనంగా నిర్వహిస్తున్నామని సిమ్స్ బాప్టిస్ట్ చర్చి కార్యదర్శి, సంఘమిత్ర ఆర్ఎస్.జాన్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ పక్కనున్న చర్చి ఆవరణలో మెస్సియా మార్చ్‌కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 14వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి చర్చి ఆవరణలో ప్రత్యేక ప్రార్థనలు, కేక్ కటింగ్ ఉంటాయన్నారు. కార్యక్రమానికి ఎంఎస్ఎంఈ చైర్మన్ శివశంకర్ ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభిస్తారన్నారు. క్రైస్తవ సంఘాల ప్రతినిధులు కార్యక్రమానికి హాజరై ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదాడ మోహనరావు, చర్చి పాస్టర్లు, ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ


స్వామికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ సేవ శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. సాయంత్రం సీతారామచంద్రస్వామిని అర్చకులు నూతన పట్టు వస్త్రాలతో సుందరంగా అలంకరించి మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తూర్పు రాజగోపురం వద్దనున్న ప్రాంగణ వేదిక వద్దకు తీసుకువెళ్లారు. అనంతరం దీపాలంకరణ వేడుక ప్రారంభించారు. వేద మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేక ఊయలలో స్వామివారిని వేంచేపు చేసి దీపపు కాంతుల వెలుగుల్లో ఊంజల్ సేవతో పాటు అష్టోత్తర శతనామావళి అర్చన నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్తవర్గీకరణపై అవగాహన కల్పించండి

విజయనగరం: తడి, పొడి చెత్త వర్గీకరణపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, ఈ విషయమై గతంలోనే ప్రజలకు అవగాహన కల్పించినా ఆశించిన ఫలితం రావడం లేదన్నారు. ఇంటికి వచ్చిన గ్రీన్ అంబాసిడర్లకు ప్రజలే తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇచ్చేలా ప్రజలకు తెలియజేయాలన్నారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటి చెత్త సేకరించారు.

తపాలా సేవలు వినియోగించుకోండి

● పోస్టల్ సూపరింటిండెంట్ కొల్లూరు శ్రీనివాస్


మాట్లాడుతున్న తపాలా శాఖ జిల్లా ఎస్పీ శ్రీనివాస్

నెల్లిమర్ల: తపాలా శాఖ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన పథకాలు, సేవలను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని తపాలా శాఖ విజయనగరం ఎస్పీ కొల్లూరు శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని సబ్ పోస్టాఫీస్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అనేక సేవలందిస్తోందన్నారు. ఎస్‌పీఎంలు, సిబ్బంది ప్రజలకు వివరించి తపాలా శాఖ సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌పీఎం జి. ఎర్రయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం

● కార్పొరేషన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి


సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి

విజయనగరం: ప్రణాళికా విభాగం పరంగా ప్రజల నుంచి వచ్చే సందేహాలు, సమస్యలను పరిష్కరించడమే టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ ముఖ్య ఉద్దేశమని అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ మేరకు టౌన్ ప్లానింగ్ కార్యదర్శులు, లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్, బిల్డర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ రమణమూర్తి మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారంపై ఓపెన్ ఫోరమ్ ద్వారా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. గతంలో ఈ ఓపెన్ ఫోరమ్ విధానం ఉండేదని, కొన్నాళ్ల విరామం అనంతరం మళ్లీ ఈ విధానాన్ని పునరుద్ధరించడం జరిగిందన్నారు. తమ పరిధిలో పరిష్కరించలేని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీపీఓ అప్పలరాజు, టీపీఎస్ అనిత, తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లికి స్వర్ణపుష్పార్చన



ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారికి శుక్రవారం స్వర్ణపుష్పార్చన సేవను ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్‌లు శాస్త్రోక్తంగా కుంకుమార్చన నిర్వహించారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ ఇన్చార్జ్ ఈఓ కేఎన్‌వీడీ.ప్రసాద్ పర్యవేక్షించారు.

– విజయనగరం టౌన్

నిరసన..



తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు శుక్రవారం స్థానిక మండల విద్యావనరుల కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ.. వర్కర్లకు కనీస వేతనం రూ. 15 వేలు ఇవ్వాలని.. మెనూ చార్జీలు రూ. 20కి పెంచాలని కోరారు. పెండింగ్ బకాయిలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ, మధ్యాహ్న భోజన పథకం వర్కర్లు పాల్గొన్నారు.

– డెంకాడ

సౌకర్యాలు కల్పించాలి..



ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కావెంజర్స్‌కు ఈఎస్‌ఐ, పీఎఫ్, సిక్ లీవులు వంటి సౌకర్యాలు కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ. జగన్ మోహనరావు, స్కావెంజర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కే బేగం , వై.నందిని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కస్పా హైస్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, ప్రతి 50 మంది విద్యార్థులకు ఒక స్కావెంజర్‌ను నియమించాలని కోరారు. కనీస వేతనం రూ. 12 వేలు ఇవ్వాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 16న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టనున్నట్లు చెప్పారు.

– విజయనగరం ఫూల్‌బాగ్

స్పందన కరువు



స్వర్ణాంధ్ర – 2047 విజన్ డాక్యుమెంటరీని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విజయవాడలో శుక్రవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో ప్రత్యక్ష ప్రసారం చేశారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, ప్రజలను ఆహ్వానించినా ఎవ్వరూ రాకపోవడంతో కార్యక్రమం వెలవెలబోయింది.

– విజయనగరం అర్బన్

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

● తహసీల్దార్ సుదర్శనరావు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని గుషిణి గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుదర్శనరావు ఆధ్వర్యంలో సిబ్బంది రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ, భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

గాజులరేగలో..

విజయనగరం: నగరంలోని గాజులరేగ, గాంధీ మండపం వద్ద రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ కూర్మనాథ్, నగరపాలక సంస్థ అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధులు పాల్గొని రెవెన్యూ సదస్సులపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు నడిపల్లి ఆదినారాయణ, కర్రోతు రాధామణి, పట్టా ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

విద్యుత్ ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రెడ్డి శంకరరావు

విజయనగరం ఫూల్‌బాగ్: విద్యుత్ ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దుచేయాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వెంటనే ఆపాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కోట వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం రెడ్డి శంకరరావు మాట్లాడుతూ.. టీడీపీ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం నేడు అధానికి అమ్ముడుపోయి ప్రజలపై రూ. 16,800 కోట్ల భారం మోపిందని ఆరోపించారు. పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం ప్రతినిధులు పాలూరి రమణమ్మ, రమణ, రామచంద్రరావు, రంభ శ్రీనివాసరావు, శాంతమూర్తి, రాకోటి ఆనంద్, వెంకటరావు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పాడి పశువుల పెంపకంతో ఆదాయం

● ఎమ్మెల్యే లోకం నాగమాధవి, ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు


రైతులకు స్టీల్‌క్యాన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి,మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు, తదితరులు

డెంకాడ: పాడి పశువుల పెంపకంతో రైతులకు ప్రతిరోజూ ఆదాయం లభిస్తుందని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి, ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. మండలంలోని గంట్లాం గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం, లేగదూడల ప్రదర్శన కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మన ప్రాంతంలో ఎక్కువ మంది ప్రజలు వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ వృత్తులపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. మూగజీవాలకు సరైన వైద్య సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం ఉత్తమ లేగదూడల పెంపకందారులకు బహుమతులు, రైతులకు పశుపోషణ పదార్థాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ వైవీ రమణ, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఉప సంచాలకుడు రాధాకృష్ణ, సహాయ సంచాలకుడు ఉమాశంకర మహాపాత్రో, డెంకాడ, భోగాపురం మండలాలకు చెందిన పశువైద్యులు శ్రీకాంత్, రామరాజు, సంతోష్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.